క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన దళితసంఘాల నేతలు


ఎమ్మెల్యేతో దళిత సంఘం నాయకులు

షాద్‌నగర్‌టౌన్: ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను మంగళవారం దళిత సంఘాల నేతలు తన క్యాంపు కార్యాలయంలో కలిశారు. పాత జాతీయ రహదారి విస్తరణ చేపడుతున్న నేపథ్యంలో పట్టణ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహాన్ని అక్కడే ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు టెలిఫోన్ వెంకటయ్య, సిద్దార్థ, జనార్దన్, నర్సయ్య, యాదగిరి, అర్జునప్ప, కృష్ణయ్య, అర్జున్‌కుమార్, బుచ్చన్న, భీష్మ రామకృష్ణ, నర్సింహ్మా, రవి, యాదయ్య, మహేష్, వినోద్ తదితరులు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడి ఎంపిక


భాస్కర్‌గౌడ్

కేశంపేట: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నిర్దవెల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌గౌడ్‌ను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివాసేనరెడ్డి ఎంపిక చేసి నియామక పత్రం అందజేశారు. మండలంలో యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. భాస్కర్‌గౌడ్‌ను మూడొవసారి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించడం పట్ల పలువురు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం


సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొందుర్గు: మండలంలోని పులుసుమామిడి గ్రామంలో మంగళవారం సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులను వార్డు సభ్యులు అంజమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు రెడ్డి నర్సింలు మాట్లాడుతూ.. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5 లక్షలతో ఈ రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భూపాల్‌రెడ్డి, రామచంద్రయ్య, యాదిరెడ్డి, మల్లారెడ్డి, జగన్‌రెడ్డి, గోపాల్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఘనంగా చౌడమ్మ బోనాలు


నైవేద్యం తీసుకువెళ్తున్న మహిళలు

మొయినాబాద్ రూరల్ : అజీజ్‌నగర్ గ్రామం బోనాల సంబురం దద్దరిల్లింది. మంగళవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో చౌడమ్మ అమ్మవారికి మహిళలు ఆనవాయితీగా వస్తున్న గంపల్లో బోనాలు పెట్టుకొని ఊరేగింపుతో ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పునకాలతో డప్పుల దరువులతో దద్దరిల్లింది. యువకులు డీజే పాటలతో నృత్యాలు చేస్తూ అందరిని ఆకర్షించారు. జంట నగరాలతో పాటు ఆయా ప్రాంతాల భక్తులు పాల్గొని అమ్మవారిని సందర్శించుకున్నారు. యాదవ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన మల్లన్న బోనాలు, కల్యాణం, ఒగ్గు కథలు మూడవ రోజు మంగళవారం చౌడమ్మ అమ్మవారి బోనాలతో ముగిశాయి.

దాతల సహకారం అవసరం

హోలీస్పిరిట్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సంగీత


బ్యాగ్స్ పంపిణీ చేస్తున్న గీత, చిత్తథామస్

చేవెళ్ల: విద్యార్థులకు దాతల సహకారం ఎంతో అవసరమని హోలీస్పిరిట్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సంగీత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని హోలీస్పిరిట్ పాఠశాలలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, చిత్తథామస్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదిగినప్పుడు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని చెప్పారు. విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దాత తోంట శ్రీను మాట్లాడుతూ...తాము సంపాదించిన దాంట్లో కొంత డబ్బు పేద విద్యార్థులకోసం ఖర్చు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులున్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఏడీఏ రాజారత్నం


కొత్తూరు: చిరుధాన్యాల ప్రాముఖ్యతను ప్రదర్శిస్తున్న అధికారులు, రైతులు

కొత్తూరు: చిరుధాన్యాలతో ఆహారం తీసుకుంటే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా జీవనం సాగిస్తారని షాద్‌నగర్ ఏడీఏ రాజారత్నం(వ్యవసాయ సంచాలకులు) ప్రజలకు వివరించారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో మంగళవారం చిరుధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతులు, ప్రజలకు ఆహారంలో వాటి ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. జొన్నలు, రాగులు, కొర్రలు మొదలైన చిరుధాన్యాల్లో అనేక రకాలైన పోషకాలు ఉంటాయన్నారు. మన పూర్వీకులు వీటిని తినడం వలనే ఎలాంటి అనారోగ్యాలకు గురికాకుండా జీవనం సాగించినట్లు వివరించారు. రైతులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా చిరుధాన్యాల పంటలను సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అజయ్‌నాయక్, ఉప సర్పంచ్ శ్రీరాములుయాదవ్, నాయకులు మెండెకృష్ణ, జంగయ్య, భీమయ్య, ఏఓ గోపాల్, ఏఈఓ దీపిక, రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల వాడకంపై ర్యాలీ

కేశంపేట: జాతీయ ఆహార భద్రత మిషన్ 'అంతర్జాతీయ చిరుధాన్యాల 2023'లో భాగంగా మండలంలోని కొత్తపేట, అల్వాల రైతువేదికల వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చిరుధాన్యాలను వాడకం వల్ల కలిగే లాభాలను ప్రజలు వివరించారు. జొన్న, సజ్జలు, రాగులు, కొర్రలు మొదలైన పంటలను సాగుచేసేందుకు ముందుకు రావాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో కొత్తపేట సర్పంచ్ నవీన్‌కుమార్, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు రాము, వినయ్, నరేష్‌కుమార్ యాదవ్, కృష్ణ, జగన్‌రెడ్డి, శ్రీనివాసులు, రఘురాంగౌడ్ పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

మొయినాబాద్: రైతులు చిరుధాన్యాల సాగుపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాధికారి రాగమ్మ అన్నారు. మొయినాబాద్ మండలంలోని రైతు వేదిక వద్ద మంగళవారం జాతీయ ఆహారభద్రత మిషన్ అంతర్జాతీయ చిరుధాన్యాల- 2023 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు చిరుధాన్యాల సాగు రకాలు, వాటి ప్రాముఖ్యతలపై అవగాహన కల్పించారు. మండలంలోని రైతులు చిరుధాన్యాల సాగు పెంచాలన్నారు. రైతులకు ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయాధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి వ్యవసాయాధికారులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓలు కుమార్, సునీల్, రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు పెంచాలి

చేవెళ్ల: మన సంప్రదాయ పంటలైన చిరుధాన్యాల సాగును పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసి అన్నారు. మండలంలోని ఆలూరు గ్రామంలో మంగళవారం చిరుధాన్యాల సాగు, వాటియొక్క ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన సంప్రదాయ పంటలైన చిరుధాన్యాలలో ముఖ్యంగా కొర్రలు, సామలు, అండుకొర్రలు, అరికెలు, ఊదలు, రాగులు, జొన్నలు, సజ్జలు, తదితర పంటల ప్రాముఖ్యతను గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కసిరె వెంకటేశ్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బి. రాంరెడ్డి, వ్యవసాయ విస్తారణ అధికారులు రాజేశ్వర్‌రెడ్డి, రమేశ్, స్వాతి, వరుణ్, బాలక్రిష్ణ, రైతులు, నాయకులు ఉన్నారు.


కొత్తూరు: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


మొయినాబాద్: ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు

ఎమ్మెల్యేను కలిసిన అంగన్‌వాడీ టీచర్ల

చేవెళ్ల: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించేలా అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్యను సీఐటీయూ అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ.. గత 40 సంవత్సరాలుగా అంగన్‌వాడీ టీచర్లుగా ఐసీడీఎస్‌లో పనిచేస్తున్నారని వారికి ఎలాంటి ఉద్యోగ భద్రత లేదని చెప్పారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం లేదని రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేవన్నారు. 2017 నుంచి టీఏ, డీఏలు ఇవ్వడం లేదన్నారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తవించి ప్రభుత్వం స్పందించేలా చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యూనియన్ నాయకులు చేవెళ్ల ప్రాజెక్టు సలహాదారులు వరలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు కల్పన, భాగ్యమ్మ, ప్రేమలత ఉన్నారు.

దేవాలయంలో ప్రత్యేక పూజలు

షాద్‌నగర్: పట్టణంలోని పరిగిరోడ్డులో ఉన్న శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో విష్ణు సహస్రనామ పారాయణం, దివ్య ప్రబంధ పారాయణం, వేద పారాయణం, ద్వార తోరణ, ధ్వజ, కుంభ ఆరాధన, మూలమంత్ర వాసం, శయనాది వాసం, హోమం వంటి తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కట్టా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల శ్రేయస్సే భవితకు మార్గం

జిల్లా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ విశాల



సమావేశంలో మాట్లాడుతున్న విశాల

షాద్‌నగర్‌రూరల్: బాలికల శ్రేయస్సే భవితకు మార్గమని జిల్లా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ విశాల అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవ ముగింపు కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలోని శివదత్తా గార్డెన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విశాల, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిణి మోతీ, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం బాలికల సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టిందన్నారు. వారిని అన్ని రంగాల్లో ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఆడబిడ్డల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి వారి భవిష్యత్తుపై భరోసా కలిప్తుందని తెలిపారు. ఆడపిల్లలను ఎవరు తక్కువగా చూడొద్దన్నారు. అలాగే, విద్యలో బాలికల ప్రాతినిధ్యం, భాగస్వామ్యం పెరిగేలా ప్రభుత్వం సమగ్ర పథకం కింద అనేక కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఎంతో అలకరించాయి. కార్యక్రమంలో జయలక్ష్మి, సీడీపీఓ నాగమణి, ఎంపీపీ ఖాజా ఇద్రీస్, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీడీఓలు వినయ్‌కుమార్, శరత్‌చంద్రబాబు, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, ఏపీఎం భగవంతు తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ పీఎస్‌ను కొనసాగించండి

మొయినాబాద్: రాజేంద్రనగర్ ఏసీపీ పరిధిలోని మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌ను యథావిధిగా కొనసాగించాలని టీడీపీ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి కొమ్మిడి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌ను చేవెళ్ల ఏసీపీ పరిధిలోకి మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని.. దాన్ని విరమించుకోవాలన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ ఏర్పడినప్పటి నుంచి మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ నార్సింగి సర్కిల్, రాజేంద్రనగర్ ఏసీపీ పరిధిలోనే ఉందన్నారు. ఇప్పుడు చేవెళ్ల ఏసీపీ పరిధిలోకి మారిస్తే మొయినాబాద్ మండల ప్రజలకు దూరం పెరుగుతుందన్నారు. ప్రజలంతా మొయినాబాద్ నుంచి నగరం వైపు వెళ్లాలని చూస్తారని.. చేవెళ్లకు వెనక్కి వెళ్లాలంటే ఇబ్బంది పడతారన్నారు.

కంటి వెలుగుపై అవగాహన కల్పించాలి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి


రికార్డులను పరిశీలిస్తున్న జయలక్ష్మి

షాద్‌నగర్: ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో 'కంటి వెలుగు'పై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి సూచించారు. మంగళవారం బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాయికల్ గ్రామంలో నిర్వహించిన కంటి వెలుగు శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి సమస్యలతో ఎవరు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామగ్రామాన కంటి వెలుగు శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కంటివెలుగుపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కంటి సమస్యలతో బాధపడే వారిని గుర్తించి శిబిరానికి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని చెప్పారు. దగ్గరి చూపు సమస్య ఉన్న వారిని గుర్తించి కంటి అద్దాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కంటి సమస్య తీవ్రంగా ఉంటే వారిని హైదరాబాద్‌లోని సరోజిని ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు జయప్రకాష్, శ్వేత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, నర్సు పుష్పలీల, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్


కాల్వ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: అభివృద్ధిలో ప్రజలందరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో మున్సిపాలిటీ నిధులు రూ.6లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న అంతర్గత మురుగు కాల్వ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీ తీర్చిదిద్దుతామన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన చింతకింది వెంకటేష్‌కు రూ.43,500 రాయికల్ గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌గౌడ్‌కు రూ.60వేలు, కమ్మదనం గ్రామానికి చెందిన అఖిల రూ.13,500ల చెక్కులను అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని 17వ వార్డుకు చెందిన నసీమా బేగం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె ఆపరేషన్ నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి ఎమ్మెల్యే రూ.2.50లక్షలు మంజూరు చేయించారు. సంబంధించిన ఎల్‌ఓసీ బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ ఛైర్మన్ నరేందర్, వైస్ ఛైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్, అంతయ్య, శ్రీశైలంగౌడ్, శంకర్, రవి యాదవ్, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

టీయూటీఎఫ్ అభ్యర్థి మల్లారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి మల్లారెడ్డి

మొయినాబాద్ రూరల్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర కృషి చేస్తానని టీయూటీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి దేవన్నగారి మల్లారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తోల్‌కట్ట, కేతిరెడ్డిపల్లి, కనకమామిడి, అమ్డాపూర్ గ్రామాల్లోని ఆయా పాఠశాలలో మంగళవారం మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఆయా జిల్లాల నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా టీయూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి దేవన్నగారి మల్లారెడ్డి సంఘ సభ్యులతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమంలో టీయూటీఎఫ్ కీలక పాత్ర పోషించిందని ఇందుకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షుడిగా తానే కొనసాగుతున్నాని తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపిస్తే దశాబ్దాకాలంగా పెండింగ్‌లో ఉన్న సర్వీస్‌రూల్స్, శాశ్వత పరిష్కారం సీపీఎస్ రద్దు ఒత్తిడి లేని విద్య, పదోన్నతులు, బదిలీలు, 317 బాధిత, పండిత్ పీఈటీల కేజీబీవీ టీచర్ల సమస్యలను పరిష్కరింపజేసి ఉపాధ్యాయులందరి సంతోషాన్ని నింపే బాధ్యత వహిస్తానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మునీర్ పాషా, చేవెళ్ల మండలాధ్యక్షుడు దయానందం, తోల్‌కట్ట పాఠశాల ఉపాధ్యాయుడు నర్సింహారెడ్డిలు పాల్గొన్నారు.

పీఏసీఎస్ భవన నిర్మాణానికి లైన్ క్లియర్

చిలుకూరు రెవెన్యూలో నిర్మాణానికి పంచాయతీ తీర్మానం


సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు

మొయినాబాద్: సురంగల్-మొయినాబాద్ పీఏసీఎస్ నూతన భవన నిర్మాణానికి లైన్ క్లియర్ అయ్యింది. చిలుకూరు రెవెన్యూలో భవనం నిర్మాణానికి గ్రామ పంచాయతీ తీర్మానం చేసింది. దీంతో త్వరలోనే పీఏసీఎస్ నూతన భవనం నిర్మాణ పనులు మొదలు కానున్నాయి. మొయినాబాద్ మండల కేంద్రంలో అద్దె భవనంలో కొనసాగుతున్న పీఏసీఎస్ కార్యాలయానికి సొంత భవనం నిర్మాణం కోసం ఏడాది క్రితమే ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే భవనం నిర్మాణానికి మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలం చిలుకూరు రెవెన్యూ పరిధిలోకి రావడంతో కొంత కాలంగా చిలుకూరు గ్రామ పంచాయతీ అనుమతి ఇవ్వలేదు. దీంతో భవన నిర్మాణం పనులు మొదలు కాలేదు. మంగళవారం చిలుకూరు గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం సర్పంచ్ గునుగుర్తి స్వరూప ఆంధ్రూ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో చిలుకూరు రెవెన్యూలో పీఏసీఎస్ నూతన భవనం నిర్మాణానికి అనుమతిస్తూ పాలకవర్గం తీర్మానం చేసింది. దీంతోపాటు చిలుకూరు గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై చర్చించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

భూపోరాటాలకు సిద్ధం కావాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య డిమాండ్


మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

చేవెళ్ల: జిల్లాలోని నిరుపేదలకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భూపోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. చేవెళ్ల సీపీఐ కార్యాలయంలో మంగళవారం మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జంగయ్య మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ భూములను భూ కబ్జాదారులు కబ్జాలకు పాల్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా చోద్యం చేస్తోందని మండిపడ్డారు. పేదలు సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకుంటే నాయకుల మీద అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ఎం. ప్రభులింగం, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, సుభాన్‌రెడ్డి, మండల సహాయ కార్యదర్శి ఎం.డి మక్బుల్ ఉన్నారు.

లేగదూడలకు బ్రూసెల్లా టీకాలు తప్పనిసరి

పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి


లేగదూడలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

చేవెళ్ల: లేగదూడలకు బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని సోలీపేట్, బోనగిరిపల్లి, నాగర్‌కుంట, కక్కులూర్ గ్రామాల్లో సిబ్బందితో కలిసి లేగదూడలకు బ్రూసెల్లా వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పశువుల ఆరోగ్యం పట్ల రైతుల జాగ్రతలు పాటించాలని సూచించారు. 4–8 నెలల వయస్సు కలిగిన లేగదూడలకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులున్నారు.

ఐక్యంగా అధికారంలోకి..

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంకర్


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు శంకర్

కొత్తూరు: ఐక్యంగా మెలిగి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చే విధంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ షాద్‌గనర్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు శంకర్ పిలుపునిచ్చారు. హత్‌సే హాత్ జోడో సన్నాహక కార్యక్రమంలో భాగంగా మంగళవారం జేపీదర్గా ఆవరణలో ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. దేశంలో నెలకొన్న పరిస్థితులను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిలో చైతన్యం తీసుకురావడానికే రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో తెలంగాణలో హత్‌సే హత్ జోడో యాత్రను ప్రారంభిస్తున్నట్లు వివరించారు. యాత్రలో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనున్నట్లు వివరించారు. కాగా, నాయకులు, కార్యకర్తలు యాత్రలోగా తమ గ్రామాల అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్, బీజేపీలు ఇచ్చిన హామీలను అమలు చేశారా..? లేదా..? అనే వివరాలను సేకరించాలని సూచించారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి కాంగ్రెస్ పార్టీ చేయూతనిస్తుందనే నమ్మకాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, పురుషోత్తమ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, రవికుమార్‌గుప్త, యాదయ్య, రాంరెడ్డి, రఘు, అంబటి ప్రభాకర్, బాల్‌రాజుగౌడ్, కృష్ణారెడ్డి,రాజు, వెంకటయ్య, వీరమోని దేవేందర్ పాల్గొన్నారు.

ప్రారంభానికి పాఠశాల ముస్తాబు

టేకులపల్లి పాఠశాలకు కొత్త హంగులు


ప్రారంభానికి ముస్తాబైన పాఠశాల భవనం

కొందుర్గు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మనబడి కార్యక్రమంలో పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. నాడు శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు నేడు కొత్త హంగులతో కళకళలాడుతున్నాయి. కొందుర్గు మండలంలో మొత్తం 33 ప్రభుత్వ పాఠశాలలకు గాను మన ఊరు- మనబడి కార్యక్రమంలో మొదటి విడతగా 12 పాఠశాలలు ఎంపికయ్యాయి. అదేవిధంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో మొత్తం 39 పాఠశాలలకు గాను మన ఊరు మనబడి పథకం ద్వారా మొదటి విడతలో 13 పాఠశాలలను ఎంపిక చేయడం జరిగింది. అయితే, ఆయా పాఠశాలల్లో విద్యార్థుల అవసరాలను పరిగణనలోకి తీసుకొని ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు నిర్వహించాలని తీర్మానించారు. ఇందుకు సంబంధించిన నిధులు మంజూరు చేయడంతో పాటు, మొదటి విడత నిధులు పాఠశాలల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగింది. అయితే కొందుర్గు మండలంలో టేకులపల్లి ప్రాథమిక పాఠశాలలో పనులు పూర్తిచేసి ప్రారంభానికి ముస్తాబైంది. ఈ పాఠశాలకు కేటాయించిన రూ. 4.74 లక్షలతో పాఠశాల విద్యుద్దీకరణ, డ్రింకింగ్ వాటర్ సౌకర్యంతో పాటు, పాఠశాల భవనానికి రంగులు వేయడం జరిగింది. ఈ పాఠశాల ప్రారంభానికి ముస్తాబైంది. అదేవిధంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని తుమ్మలపల్లి పాఠశాలకు రూ. 8.36 లక్షలు మంజూరు కాగా, ప్రస్తుతం పాఠశాలలో విద్యుద్దీకరణ, డ్రింకింగ్ వాటర్ పనులు పూర్తయ్యాయి. ఇక విద్యార్థులకు సంబంధించిన డ్యూయల్ డెస్క్ బెంచీలు, పర్నీచర్ ఏజెన్సీ వారు ఇంకా సరఫరా చేయలేదు. వనంపల్లి పాఠశాలకు రూ.3 లక్షలు మంజూరు కాగా, ఇప్పటి వరకు రూ.1.07 పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు కొనసాగుతున్నాయి.


నిర్మించిన నీటి ట్యాంక్, కుళాయిలు